# ఎవరిదితప్పు?

(ఒక కథ)

మాడపాటి హనుమంతరావుగారు

౧

పండువెన్నెలయందు మనోహరమగు పిల్లవాయువులు వీచుచుండగా, గృహోద్యానమందలినీటిహౌజు (కేళాకూళి) ప్రక్కన తిన్నెపై కూర్చుండిన కృష్ణారావు సుందరమ్మతో ననెను. "నీవు భయపడవలసినపని లేదు; నేను త్వరలోనే వచ్చెదను"



సుందరమ్మ భర్తవైపు దీనమగుచూడ్కుల బరపి పలికెను. "నన్ను మీవెంట తీసికొని పోగూడదా?"

కృష్ణ: వీలులేదు. అక్కడ నీకు శ్రమ చాలయగును. నేను ఒకనాడొకచోట రెండవనాడింకొకచోట ఉండవలసివచ్చును. కంపన బడ్డకాకివలె ఊరూరు తిరుగవలసియుండును. పర్వతప్రాంతము. కొన్నిచోట్ల పెక్కుక్రోసులవరకు గ్రామమే కనుపడదు. అరణ్యము. క్రూరమృగముల భయము. మంచి వస్తువులు దొరకవు. నీ విట్టికష్టములకు అలవాటుపడిన దానవుకావు.

సుంద: మీకు మాత్రము యీ కష్టము లలవాటైయున్నవా?

కృష్ణ: నేను మగవాడను; పని బడినయెడల, ఎట్టి కష్టములనైనను సహించుకొనగలను.

సుంద: నేను ఆడుదానను; పని బడినయెడలఅగ్ని గుండములో దుముకగలను. స్త్రీలుసుకుమారలనుమాట పురుషుల కల్పనము. వారిని

అబలలని సౌకుమార్యము కలవార లని అని అని, వారిని చేతగానివారిగా జేసియున్నారు. శరీరము దుర్బలము అయినకావచ్చును గాని మానసము దుర్బలము కాదు. వారిధైర్యసాహసములను జీవితమందలి ఎట్టిఅవాంతరములైనను లొంగదీయలేవు"

కృష్ణారావు భార్యను ప్రేమపూరితమగు చూపున జూచి యనెను. "నీతర్కము యథార్థమే. కాని పురుషులయాకల్పనము చాలకాలమునుండి వచ్చుచున్నది. ఇంతప్రాతవిశ్వాసము ఒక్కనిమిషమున మాయమైపోజాలదు. నీకష్టములను జూచి సహించుట నావలన కాదు. చూడుము, యీవెన్నెల యెంతమనోహరముగా నున్నది? కొన్నివిషయములలో ఈవెన్నలకంటె సాయంత్రపు కేతయెంత ఎక్కువమనోహరముగా నుండును సుమా! నీయభిప్రాయ మేమి"?

సుంద: నామాటలను మరపించి పిచ్చిదానిని జేయవలెనని చూచుచున్నారు నేను మీవెంట వచ్చుమాట నిజము. మిమ్ము విడిచియుండుటయన్న నాకెంతో బాధాకరము. మీతో వచ్చిన శరీరకష్టము అనెదరు. శరీరకష్టముకన్న మానసికకష్టము యెక్కువ బాధించునదిగదా!

కృష్ణ: నీశ్రమమాట కాదనుకో. నీవు వచ్చుటవలన నేనుపడవలసినకష్టము లెన్నియో విచారింపుము. నీకొరకు పోయినచోట నెల్ల ఇల్లుచూచుట, బండ్లకుపర్చుట, ఇతర సుఖసాధనముల సంపాదించుట వీనియందు నాకాల

మంతయు సరిపోవును; నేస్తు" ననిపించుకొని మూలబడును. "గు" నని భర్తచేత

సుందరమ్మ నిరాశతో నవెనవ్వులవరకు ష్టము వచ్చినట్లు చేయుడు. నేను పట్టుదల వదలెదను. మీరుపోయినతరువాత మీరెట్లున్నారోయని నామన స్సూరక బాధించుచుండును. నాది విచిత్రమైనస్వభావము. మీరు యెదుట లేనప్పుడు వివిధములగు భ్రమలు, ఆందోళనలు వేధించుచుండును. అదేమివిచిత్రమోకాని మీ క్షేమమును కాపాడువారు యీప్రపంచమున నేనుదప్ప మరెవ్వరు లేరనుభావము నా హృదయమూలమూల దాగియుండును. దీనికి కారణము కనుపడదు. మీరు ఆటలాడబోయి నప్పుడు మీ కేదైన దెబ్బతగిలెనేమో యని నామనస్సు శంకించుచుండును. మీరు వేటాడబోయినప్పుడు గుఱ్ఱ మేమయిన కొంటెతనము చేసెనేమోయని మానసము కలవరపడుచుండును. ఇంతటిస్వచ్ఛమయినవెన్నెలకదా! ఇంటిలోని తోటకదా! నేను మీసమీపమునగాక యింటిలోపల నుండుట సంభవించెనేని మీరు మరల కనుపడువరకు నామనస్సునిశ్చింతగా నుండదు. నాస్వభావనిర్మాణమే అట్టిది."

కృష్ణారావు ఆమాటలువిని కొంత విచారపడెను. 'సుందరమ్మయొక్క దుర్బలమగుహృదయము వియోగభారమును సహించగలదా? సున్నితములగు ఈమెభావతంత్రులను ఏదైనయంశము త్రెంచివేయదుగదా!" అని పలుమారువితర్కించుకొని ఇట్లనెను. 'సుందరీ! నావంటి కృత్రిమస్వభావముగలవాడు నీయథార్థమగు అగాధప్రేమకు తగియుండ జాలడు? నా

తమకు అభిప్రాయమును నస్థాపించుకొనినట్లుకానవచ్చు ను. నేను సాధారణమగుభావములను కలవాడను; స్వార్థపరుడను; ఆశావంచితుడను; కార్యవాదిని; స్వసుఖము నపేక్షించువాడను. ప్రేమకన్న భోగాపేక్షకు నామనసున నెక్కువ ప్రాముఖ్యము కలిగియుండును. మిత్రులతోడ కలయిక, వేటాడుట, ఖేలనములు ఇవి లేకుండ జీవించుట నా కెంతో కష్టము! ప్రేమతరంగమునకు నామానస సముద్రమున తావుకలదుగాని ఆయల మహాదుర్బలమైనది. నామమాత్రమైనది!"

సుందరమ్మ భర్తపై అనుమానమును ప్రకటించుదృష్టిని బరపెను. ఆచూపునందు, "మాటలెన్ని చెప్పినను మీ హృదయమును నేను ఎఱుగనా?" యనుభావము వ్యక్తమగుచుండెను.

౨

కృష్ణారావుస్వభావము కొంతవిలక్షణమైనది. స్వతంత్రాభిలాషియయ్యును నియమబద్ధుడు; ధనవంతుడయ్యు జాగరూకుడు; జమీందారుడయ్యు వినయశీలుడు; గొప్పవారిప్రాపు కలవాడయ్యు పేదలకు మిత్రుడు. ఈతనితలిదండ్రులు బాల్యముననే ఈలోకమును వదలి చనిరి. ఇతనిపోషణభారము సేవకులపైన నేపడియుండెను. ప్రేమయొక్క ప్రభావమున కాతడు అపరిచితుడుగానుండెను అతడు ఏదైనవస్తువు 'నాకు కావలెను' అనగానే వచ్చుచుండెడిది. దానికొరకై ఏడ్చుటకుగాని అలుగుటకుగాని బాల్యమున అవసరమే కలిగినదికాదు. తనతో నాడుకొనుబాలుడు, తమతల్లిదండ్రులచేత చీవాట్లుపడుట యు, అప్పుడప్పుడు దెబ్బలుతినుటయు అతడు చూచియుండెను. కోపపడుటకును, మారాముపెట్టుటకును అతనిబాల్యచాపలము ఉత్సాహపడుచుండెను. కాని అతని కట్టియవకాశ మేది? పిల్లలు చీవాట్లుతినియు తమతల్లులవెంట పరుగెత్తుచునేయుందురు. పనిపాటలు నవరించుకొని ఆతల్లులు వారినెత్తికొని ముద్దుగొనగానే కలిగిన పిల్లలయానందము వర్ణనాతీతముకదా. కృష్ణారావు బాల్యమున నట్లే తన్ను ప్రేమించువారి చీవాట్లు దిని వారివలన తరువాత మెప్పునొంది వారికొంగున మోము గప్పికొని, వారిచంక కెక్కి యానందింపనువ్విళ్లులూరుచుండెను. కాని ఏడువవలసినపని పడకపోయినను నవ్వవలసినపనియు కలుగుచుండలేదు! అతనిబాల్యము నిస్సారముగాను, మనోహరదృశ్యముల లేనిదిగాను గడచిపోయెను.

పెద్దవాడైనతరువాత నలువైపులనుండియు సంబంధములు రాసాగెను. ధనవంతులగువారు వర్తమానము లంపజొచ్చిరి. వరదక్షిణలమొత్తము లోకదానికంటె నొకటి హెచ్చుపెరుగుచుండెను. కాని మనకృష్ణారావు ధనమునకుగాని ఆస్తికిగాని ఆకలిగొనియుండినవాడా? అతనిహృదయము ప్రేమను గోరుచుండెను. అతని పిపాస యాయమృతమునే వెదకుచుండినది. ఎన్నియోసంవత్సరము లీయన్వేషణము సాగుచునేయుండెను సౌందర్యము దొరకెను; సౌకుమార్యము దొరకెను; విద్య దొరకెను; నిర్వాహణసామర్థ్యము దొరకెను; కాని దొరకని దేది? అది ప్రేమయే.

కనుక బంగళాలను, సుందరమందిరములను వెదకుట మాని కృష్ణారావుకుటీరములవైపు దృష్టి సారించెను. అచ్చట నాతనికోరిక నెరవేరెను. సుందరమ్మ యొకపేదయింటియాడుపడుచు. ఆమెతండ్రి కృష్ణారావుదివాణమున గుమస్తా. చిన్నటినాట ఆమె ఆతనితో నాడిన బాలిక. కొద్దిస్థితిగల యాపిల్ల దొరసానియగునని ఎవ్వరైన తలచియుండిరా? కృష్ణారావు సుందరమ్మను వివాహమాడ నిశ్చయించెను. కావలసినవారందరు "కూడదు కూడదు" అని హితముబోధించిరి. కృష్ణారావు పట్టుదల కలవాడు. సుందరమ్మను తనయిల్లాలిగా జేసికొనియే తీరెను.

3

కొంతకాలమునకు దేశముయొక్క మారుమూలన కఱవు ఒకటి దాపురించెను. జనులు చెట్లయాకులను బెరళ్లను తినసాగిరి. వేళ్లు త్రవ్వి తీసి, కడుపు నింపుకొనుచుండిరి. క్షుద్బాధ కులాచారములను మతధర్మములను తొలగద్రోచివైచెను. శుద్ధము, ఎంగిలి వీనికి నడుమగల యంతర మెగిరిపోయెను. పశువులు, నిసువులసంగతి యటుండనిండు. మనుష్యులు తమశిశువులను తవ్వెడుగింజల కమ్ముకొన నారంభించిరి. హృదయవేధకములగు నరమాంసాహారకథలే వినవచ్చుచుండెను. పత్రికలం దీవార్తలు చదువగానే కృష్ణారావు హృదయమవిసెను. సేవాసమితి పక్షమున వెంటనే కొందరు ఐచ్ఛికభటులనుగొని ప్రయాణమయ్యెను. పోవునప్పుడు సుందరమ్మ భర్తవెంట ఒనదలచెను; ప్రార్థించెను. కాని వీలులేకపోయెను. తుదకు "త్వరగా వత్తు" ననిపించుకొని "దినమొకయుత్తరము వ్రాతు" నని భర్తచేత వాగ్దానము పొందెను. వారముదినములవరకు కృష్ణారా వాగ్దానమును పాలించెను. కాని కార్యబాహుళ్యము ప్రతిదినము హెచ్చుచుండినందున ఆలస్యము కాజొచ్చెను. కొన్నిగ్రామములు టప్పాఖానా (పోస్టాఫీసు)కు దూరమున నుండెను. కనుక ప్రతిదినము ఉత్తర మందు నేర్పాటుచేయుట యసాధ్యమయ్యెను.

సుందరమ్మ ఉదయమునుండి సాయంత్రమువరకు ఉత్తరమునకై ఎదురుచూచుచుండెడిది. ఆదినములలో ఆమె యాత్మశాంతి కిదియే ముఖ్యమగు సాధనముకదా. ఉత్తరములాలస్యముగావచ్చుట మొదలైనతోడనే ఆమెమనస్సు కలతనొంద నారంభించెను. "నేను వారి మాటలవలన నెంత మోసపోయితిని? తప్పక వెంట పోవలసియే యుంటిని." అని పరిపరి విధముల యాలోచించుచుండెను. ఎటుదోచక ఒక్కొకసారి మేడపైకెక్కును. మరల క్రిందికి దిగును. ఒకవేళ తోటలోనికి బోయి యచ్చట గూలబడును. కనుకను ప్రతివస్తువు ఆమెకు వ్యాకులమయముగా నుండెను. ఎప్పుడు చిలుకపలుకులయందలి మాధుర్యము ఎచ్చటికో పోయెను. వీణాతంత్రులలోని చిత్తాకర్షక స్వభావము నశించెను. తోటలోని లేడిపిల్ల యొక్క చెంగుచెంగులు జుగుప్సాకరములయ్యెను. పిల్లులు, కుక్కలు మున్నగు జంతువులు కరువవచ్చుచున్నట్లు తోపసాగెను. అలమారులలో మంచిమంచి పుస్తకములుండెను కాని సుందరమ్మ కవి ఏమాత్రము నానందమును

గోలుపలేదు. ఉత్తరమువచ్చువరకు ఆమెహృదయము విచారభరితమై యుండెడిది. ఉత్తరము రాగానే వాడిన చేనులమీద వర్షము పడిన ట్లగుచుండెను. ముఖకమలము వికసించును; ఉత్తరమును ముద్దుపెట్టుకొనును; కన్నుల కద్దుకొనును; మరలమరల చదివి యానందించును.

అయినను ఆ యానందము ఆనాటివరకే. మరుచటిదినము మరల నదే విచారము. కృష్ణారావు ఛాయాపటమును గంటలకొలది చూచుచుండును. మొదటిదినములలో ఇదియే ఆమె ముఖ్యదినచర్య. క్రమక్రమముగా వియోగమునకు కొంత యలవాటుపడసాగెను. మొదటి దినములలో భర్తకూర్చుండు కురిచీ, ఉత్తదిగా జూడగానే మనస్సు తత్తరపడుచుండెను. ఇప్పు డామెనిరాశావశయై యట్టిమానసికావస్థను మరలించుకొనజొచ్చెను. ఆయన పుస్తకములను—విడివిడిగా అటునిటు పడియున్నవానిని ఒకచో కూర్చి వరుసగా చేర్చిపెట్టుట; ఆయనపటముపై నపడిన దుమ్మును దులిపి, పరిశుభ్రముచేసియుంచుట, ఆయన యాయుధములను యథాక్రమమున సవరించుట మున్నగు పను లామెకు తాత్కాలిక మనశ్శాంతి కలిగించుచుండెడివి.

నెలదినములు గడచెను. ఒకనాటిరాత్రి సుందరమ్మకు స్వప్నము వచ్చెను. కృష్ణారావు ఉత్తతలతో, ఉత్తకాళ్ళతో నిలబడి ఏడ్చుచుండినట్లు ఆమె కాంచెను. కెవ్వున కేక వేసి నిద్రనుండి లేచి కూర్చుండెను. వెంటనే బంగళాపైకి బోయి చూచెను. ఎల్లెడలను వ్యాపించియున్న నిశ్శబ్దత చూచినపిమ్మట ఆమెకు బాగుగా తెలివివచ్చెను. భర్తకు తత్క్షణమే అర్జెంటుతంతివార్త పంపెను. ప్రత్యుత్తరము రాలేదు. దినమంతయు గడచెను; జవాబు లేదు. రెండవరాత్రియు గడచెను. జవాబు లేదు. సుందరమ్మ అన్నము, నీరు ముట్టక, వ్యాకులమగు మనస్సుతో కూర్చుండియుండెను. కనుపడిన వానినెల్ల "జవాబు వచ్చినదా" యని యడుగుచుండెను. ఆకు కదలినను "జవాబు వచ్చినదా?" యనుపదములే యామె పెదవులనుండి బయటబడుచుండెను!

సుందరమ్మ మనసును ఎన్నియోయనుమానములు బాధింపసాగెను. పనికత్తెలను ఈ స్వప్నఫలమేమని యడుగును. "అమ్మా! దొరగారు సుఖముగానే యున్నారు. కలలో "ఏడ్చుట" యనగా నిజమున "నవ్వుట"; కలలో ఉత్తతలతో గానవచ్చుట యనగా యథార్థమున "గుఱ్ఱము నెక్కుట." భయపడవలదు" అని సమాధానము చెప్పుచుండిరి. కాని సుందరమ్మమనస్సు నీమాటలు శాంతపరుపలేదు. "తంతికి జవాబు రాకపోవుటకు కారణమేమా" యని యామె కళవళపడుచుండెను. ఇంతలో నాలుగుదినములు గడచిపోయెను.

౪

చుట్టుపట్టు గ్రామములలో మూడు ఆమడలవరకు గోపాలశాస్త్రిగారి నెరుగనివారు అరుదు. వీరితండ్రితాతలు విశేషముగా చదువుకొనినవారగుటవలన పుట్టినతరువాత నామకరణము నాటినుండియే వీరు శాస్త్రిగారని పిలవబడుచుండిరి. వీరివృత్తి వంశక్రమముగా పౌరోహిత్యమేయైనను, జ్యోతిషమునందేమి,

సాముద్రికము నందేమి, వైద్యమునందేమి, స్వప్నఫలనిర్ణయమునందేమి వీరినైపుణ్యమును అందరును మెచ్చుకొనుచుండిరి. ప్రశ్నచెప్పుటయందు వీరికౌశల్యము ఆబాలగోపాలము ఎరుగుదురు. ఏదైన పల్లెటూరికి శాస్త్రిగారు వచ్చినచో ఆవార్త నిమిషమాత్రము నలుదెసల నల్లుకొనుచుండెను. అనుభవశాలినులగు అత్తలు విఫలమనోరథలైన తమకోడండ్రను శాస్త్రిగారికి జూపి తృణమో పణమో సమర్పించి, వారియదృష్టమును తెలిసికొనుచుండిరి. దూరదృష్టిగల తల్లులు యౌవనవతులగు తమ కూతులచేతులను శాస్త్రిగారిచే పరీక్షింపించి వారిని ధన్యురాండ్రుగ జేయుచుండిరి. శాస్త్రిగారును, సుఖదుఃఖములను, వచ్చినవారందరకు తృప్తికరముగా పంచిపెట్టుచుండిరి. ప్రశ్నలకు వారుచెప్పు ఉత్తరములలో స్పష్టత తక్కువగను, గూఢత ఎక్కువగ నుండినను, వినువారుమాత్రము వారివచనములను తమకు సమాధానమగు విధమున నన్వయించుకొని, శాస్త్రిగారి వాక్యములలోని అర్థగాంభీర్యమునకు వారినెంతయు కొనియాడుచుండిరి. కాని భక్తి విశ్వాసశూన్యులగు ఈ కాలపువారు కొందరు శాస్త్రిగారుఅదృష్టమునుగూర్చి చెప్పు ఫలములు అదృష్టముకంటె ఎక్కువగూఢముగను సందిగ్ధముగను నుండుననుచుండుటవలన శాస్త్రిగారి కప్పుడప్పుడు కొంచెముకోపము వచ్చుచుండుట కలదు. అయినను ప్రపంచజ్ఞానముకలవారుగనుక త్వరలోనే శాంతతవహించుచుందురు. నవీనవిద్యాప్రభావము జ్యోతిశ్శాస్త్రగౌరవమును తగ్గించి యుండవచ్చునేమో కాని జ్యోతిష్కుని గౌరవముమాత్రము తగ్గించలేదు. ఫలము నమ్మినను, నమ్మకపోయినను అడుగువిషయమున వెనుదీయువారెవరును కానబడరు. కనుక నవీనులమూలమున శాస్త్రిగారి ఆదాయమునకు నష్టము వాటిల్లియుండలేదు.

సుందరమ్మ భర్తకు తంతిసమాచారమంపి నేటికి అయిదుదినములు గడచినవి. ఆనాడు గ్రామమునకు శాస్త్రిగారు వచ్చిరి. ఈసంగతి తెలియగానే సేవకులు వారిని దొరసానిగారి యింటికిపిలుచుకొనిపోయిరి. చుట్టుపట్టుల అమ్మలక్కలు కృష్ణారావుగారి చావిడిలో గుమిగూడిరి. జ్యోతిష్కుడు కాలగర్భమున డాగియున్న భవిష్యత్తులన్నిటిని ఈవలకు లాగివేయసాగెను. సుందరమ్మకు కొంతసమాధానము కలుగుదారి యేర్పడెను. శాస్త్రిగారిని లోనికి రప్పించి స్వప్నఫలమును విచారించెను.

శాస్త్రిగారు ఇటునటు పరికించి చూచిరి. పంచాంగము కట్టవిప్పి కాగితముల తిరుగవేసిరి. వ్రేళ్ళగణుపులు లెక్కించిరి. కాని ఎట్టిప్రత్యుత్తర మవసరమో నిశ్చయింపలేక యడిగిరి.
"దొరసానిగారికా ఇట్టి స్వప్నము వచ్చినది?"

సుంద: కల నాకు రాలేదు. నాస్నేహితురాలికి వచ్చినది. ఇది దుస్స్వప్నమని నావాదము; కాదు మంచికలయని ఆమె వాదించుచున్నది. తమ రేమి నిర్ణయింతురు?

శాస్త్రిగారు మరల ప్రక్కలు చూడసాగిరి. కృష్ణారావు గ్రామాంతరమునకు— దూరదేశమునకు పోయినసంగతి పాపము వారికెరుకలేదు. గ్రామమునకు వచ్చినతరువాత ఈసంగతులువిచారించి తెలిసికొనునంత యవ

కాశము వారికిలభించలేదు. అట్టి యవకాశమే దొరికినచో ఆవిశేషమును దొరసానిగారి సుఖలక్షణమును, సమ్మేళనముచేసి సంపూర్ణమగు భవిష్యత్తును గాని ప్రశ్నఫలమునుగాని సిద్ధపరచియుందురు. సుందరమ్మ నొక ప్రశ్న యడిగి కొంత యవగాహన సంపాదింప శాస్త్రిగారు యత్నించిరిగాని నిష్ఫలమయ్యెను. ఎట్లైనను అమ్మగారి కనుకూలమగువిధమున ప్రశ్నఫలమును నిర్ణయించుట క్షేమకరమని భావించి పల్కెను:— "దొరసానిగారి యభిప్రాయమే సరియైనది. స్వప్నము మంచిది కాదు."

సుందరమ్మ భయవిహ్వలయై వడవడ వడకసాగెను.

శాస్త్రిగారు చెప్పుచుండిరి. "ఆమెభర్తకు గొప్ప ఆపద మూడనున్నది. గృహభాండశుద్ధి యగును. దేశాంతరగతుడగును. మహాదుఃఖదాయకమగు సంకటమేదో వచ్చిపడగలదు!"

సుందరమ్మ కెవ్వున కేకవేసెను. "ఆపద్బాంధవా! హాతోస్మి! హాతోస్మి! మాంరక్ష! మాంరక్ష!! యని యరచి మూర్ఛిల్లెను.

తాను మోసపోయినసంగతి శాస్త్రిగారు ఇప్పుడు గ్రహించిరి. ఇప్పుడాతడు సుందరమ్మను ఓదార్పసాగెను. "అమ్మా! ఇట్లంటివని భయపడవలదు. దీనిపరిహారము నాకు తెలియును. నాకు కొంచెము నూనె, దారము, ఒకక్రొత్తకుండ తెప్పించి యివ్వండి. ఒక కొబ్బరికాయ, పదినిమ్మకాయలు దొరికితే చాలును. తక్షణమే నివారణము చేయుదును. దొరగారు సుఖముగా నున్నసమాచారము వచ్చినతరువాత తమచిత్తమునకునచ్చినబహుమానము దయ చేయవచ్చును. కార్యము కఠినమగుసంగతి మాత్రము నిజము. అయినను ఈశ్వరానుగ్రహమువలన నే నీదుస్స్వప్నదోషమును పోగొట్టగలను. నాకు గొప్పగొప్ప మహారాజులెన్నియో బహుమానము లిచ్చి సత్కరించినారు. మొన్న మొన్న తహస్సిలుదారుగారి బిడ్డ వ్యాధిగ్రస్తురాలైనది. డాక్టరులు మంచి మంచివారు—చేతులు వెలికలవేసిరి. నేనొకయంత్రము ఇచ్చితిని. తీసివేసినట్లు వ్యాధి మాయమై పోయి తెలివి వచ్చెను. ఇది నిన్నటి మాటయే! మొన్న సముద్రాల శేఖరయ్యగారియింట నొక రూపాయలసంచి మాయమైనది. నేను ప్రశ్నచూచి



చెప్పితిని. నిముసములో దొంగ పట్టుబడెను. అత డెవ్వడో కాడు వారిగుమాస్తాయే. సంచి వానియింటిలోనుంచి చెక్కుచెదరక బయట బడెను. ... ... ... ...

శాస్త్రిగారు స్వీయచరిత్ర వినుపించుచుండిరి కాని సుందరమ్మకు స్మృతియే లేదు. విషము శరీరమంతట ఎగబ్రాకెను! మంత్ర మిప్పుడేమిపని చేయగలదు?

కొంతసేపటికి తెలివి వచ్చినది. పనికత్తెను పిలిచి యిట్లాజ్ఞాపించెను. "ప్రయాణసన్నాహము చేయుము. సాయంత్రపు రైలుబండిలో వెళ్ళెదను. మనుష్యుల సిద్ధముగ నుంచుము. దొరగారియొద్దకు బోవలయును.— శాస్త్రిగారికి గుమాస్తాతో చెప్పి ఏమైన ఇప్పించుము."

౫

కృష్ణారావు వ్రాసిన తుదియుత్తరమునందు ఆయన సీతాపురమున నున్నట్లుండెను. కనుక టికటు తీసుకొని సుందరమ్మ రైలులో నెక్కెను. పరిచారకులు వేరుబండిలో గూరుచుండిరి. కొన్నిదినములనుండి యామెకు నిద్దరయే లేదు. రైలు కదిలినకొంతసేపటికి ఆమె కన్నులు కునుకసాగెను నిద్దుర పట్టగానే మనసులోని కలవరము విచిత్రములగు దృశ్యములను ప్రదర్శింపదొడగెను.

విశాలమగు సముద్రము. దానిలో నొక పగిలినపడవ అటునిటు కొట్టుకొనుచున్నది. దానిమీదమాలిమికాడు లేడు. తెరచాప లేదు. తెడ్లు లేవు. తరంగములతాకుడువ నొక్కొక్కసారి యది పైకి లేచుచుండును. మరియొక్కొకవేళ క్రిందికి బోవుచుండును. అకస్మాత్తుగా దానిపై నొకమానవు డగపడెను. అతడు కృష్ణారావే. ఉత్తతల; ఉత్త కాళ్లు; కన్నుల నశ్రువులు గారుచున్నవి. సుందరమ్మ ఈదృశ్యమును జూచి కంపించుచుండెను. పడవ మునిగె; మునిగె, ననుస్థితియందుండెను. ఆమె బిగ్గరగా కేకవేసెను. కన్నులు తెరిపిడిపడెను. శరీరమంతయు చెమ్మటచే దడిసియుండెను. గుండె తటతట కొట్టుకొనసాగెను. లేచి, ముఖము కడిగికొని, ఇక నిద్రపోకూడదని ధైర్యముతో గూర్చుండెను. "అక్కటా! ఎంతటి భయంకరమగు కల! దేవా! నిన్నే నమ్మియున్నాను!! వారికెట్టి యాపదయు రానీయకుము!!!" అనుకొనెను.

తల బయటికి వెళ్ళబెట్టి చూచెను. ఆకాశమున నక్షత్రములు ప్రకాశించుచుండెను. గడియారమున ౧౨ గంటలు కొట్టెను. పుస్తకమొకటి పెట్టెలోనుండి తీసి భావములను కేంద్రీకరింప యత్నించెను. కొంతసేపైనతరువాత కన్నులు మూతలుపడసాగెను. మరల తెలివిదెచ్చుకొని బిగ్గరగా చదువ మొదలుపెట్టెను. ఎన్నియోదినములనుండి నిద్రనెరుగనికనులు, ఆమెయుద్దేశ్యమునకు లొంగ నిష్టపడలేను. అంత దిండుకు తలను ఆనించి చదువనారంభించెను. కునికిపాట్లు మొదలయ్యెను. మరియొకదృశ్యము ఎదుటికువచ్చెను!

పెద్దపర్వతము. దానిశిఖరము ఆకాశమునంటినట్లుండెను. పైనున్నవృక్షములు చిన్నమొక్కలవలె గాన్పించుచుండెను. నల్లనిమేఘ

...ములు కమ్ముకొని, చెవులు చిల్లులుపడునట్లు గర్జించుచుండెను. భయంకరమగు నాపర్వత శిఖరమున మానవు డొకడు నెత్తికి బట్టలేక కూర్చుండియుండెను. అంత ఎత్తున నున్నను అతని కన్నులనుండి కారుచున్న నీటిచుక్కలు స్పష్టముగా కానవచ్చుచుండినవి. సుందరమ్మ హృదయము వ్రక్కలయ్యెను. ఆవిగ్రహము కృష్ణారావుదే! అతడాకొండపైనుండి క్రిందికి దిగయత్నించుచుండెను. కాని దారిదొరకదు. ఆయన ముఖము భయముచే పచ్చబారియుండెను. తటాలున మేఘమధ్యమునుండి పిడుగు దిగజారెను. దానినుండి వెడలిన మహాజ్వాల కృష్ణారావు విగ్రహమును కనుపడకుండ జేసెను!

సుందరమ్మ మరల కేకవేసెను. తెలివి వచ్చినది. రొమ్ము పగులుచుండినట్లు తోచెను. కన్నులనుండి వెడలు నీరు ప్రవాహముగా మారెను. లేచినిలచి, రెండుచేతులునుమోడ్చి, ఆకాశమువంక జూచి ప్రార్థింపజొచ్చెను. "ప్రభువా! నా కిట్టి దుస్స్వప్నములు పరంపరగా వచ్చుచున్నవి. వారిగతి ఎమైనదో తోచుట లేదు. నీవు దీనులపాలిటి కల్పవృక్షమవు. నాపై దయజూపుము. నా కైశ్వర్యము వలదు! మందిరముతో పనిలేదు. కుటీరమునందు మహాసంతోషముతో నుందును. భర్తగారి క్షేమము మాత్రము అనుగ్రహింపుము. ఇదియే నాకు గావలసినవరము!"

సుంధరమ్మ స్వస్థలమున గూర్చుండెను. తెలతెలవార జొచ్చినది. రాత్రి గడచినది; కనుక ఇక నిద్దుర రాదుకదాయని యామె ధైర్యముతెచ్చుకొనెను. మార్గమున కిరుప్రక్కల మనోహరములగు వృక్షలతాదులును, పచ్చికబయళ్ళును నేత్రపర్వము చేయుచుండెను. చూచుచుండగనే ఎప్పుడు కన్నుల మలిగెనో కాని నిద్ర పట్టనేపట్టెను! కల రానేవచ్చెను!!

కృష్ణారావు గుర్రముపై నెక్కి యొక వంతెనమీదుగా బోవుచున్నాడు! వంతెన చాల ఇరుకైనది!! గుర్రము తంటాలు పెట్టుచున్నది!!!

"గుర్రమునుదిగండి! గుర్రమునుదిగండి!" యని అరచుచు ఆసుందరమ్మ ఆతనివైపు దుమికెను. కన్నులు తెరచి చూచువరకు రైలుబండి ఏదోస్టేషను ప్లాటుఫారమువద్దనుండి సరసర సాగిపోవుచున్నది. కృష్ణారావు ఉత్తతలతో ఉత్తకాళ్ళతో ప్లాటుఫారముపైన నిలచియుండెను. సుందరమ్మ దృష్టియందింకను స్వప్నములోని దృశ్యమే స్థగితమైయుండినది. భర్తను చూడగానే, అతడు గుర్రమునుండి క్రిందపడి నదిలోనికి బోవుచున్నాడని భ్రమించెను. తత్‌క్షణమే యాతని పట్టుకొనుటకై యామె చేతులుసాచెను. భర్త శరీరము అందకపోయినందున అసంపూర్ణ జాగ్రదవస్థలోనే యామె రైలుబండితలుపు తెరచెను! ఆకాశమునుండి ఎవరో నేలపైకి పడద్రోచినట్లయ్యెను! గట్టిదెబ్బ యొకటి తగిలినట్లు స్ఫురించెను!! అంత స్మృతితప్పిపోయినది !!!

సీతాపురముస్టేషను ఇదియే. సుందరమ్మ పంపినతంతివార్త అంది భర్తస్టేషనుకు వచ్చియుండెను. అది మే లు బం డి యగుటచేత

అచ్చట ఆగదు. భార్యచేతులుముందుకుసాచు చుండుటచూచియతడు "హా! హా!" యని వాపోం చుచు విద్యుత్తువంటి వేగముతో ముందునకు దుమికెను. కాని అంతలోపలనే, లలాట లిఖితము పూర్తి అయ్యెను. సుందరమ్మ వియోగ దుఃఖమునకు తావు లేనిలోకమును చేర నేచేరెను!

కృష్ణారావు మూడవదినమున స్వగ్రామము వచ్చెను. దుఃఖభారమును సహింపలేక, ఆస్తియంతయు సేవాసమితికి దానముచేసి, ఉత్తతలతో, ఉత్తకాళ్ళతో దేశదేశములు సంచరించుచున్నాడు. శాస్త్రిగారి వాక్యము ఫలించినది !!

# ముక్తావళి

వేదుల సత్యనారాయణశాస్త్రి శతావధాని, (సాహితీసమితి సభ్యుడు)

౧

పూవుల రోజులుం గడచిపోయె, విషాద హిమావృతాంధకా
రావిలమయ్యె, ఈ ప్రకృతి యంతయు; ఆకులపాటునొంది పూ
దీవలు నాదు లేయెడద తీరున స్రోడయిపోయె, నాటి యా
జ్ఞావిధి స్వామి! నాకిపుడు జ్ఞప్తికివచ్చి భయంబు పుట్టెడున్.
ఈ మధుమాసశోభ గతి యించక పూర్వమె పూలతోటలో
కోమల పుష్పముల్ వెదకి కోసి మనోజ్ఞపుమాల గ్రుచ్చియున్
నామెడలోన వేయుమనినావపుడొక్క సుమంబునైన, నో
స్వామి! భవత్పదార్పణము సల్పగ లేనయితిన్ విమూఢతన్.

౨

నావలె, శుష్కజీవనమునన్ దురపిల్లెడు, ఈ పవిత్ర గో
దావరి పేద వడ్డనిన దంబులతో శ్రుతి గల్పి, ప్రేమరా
గావహదుఃఖగీతు లిపుడల్లుచు, గ్రుచ్చుచునుంటి నొక్క ము
క్తావళినిం, బవిత్రనయనాంబు కణోజ్జ్వలమౌక్తికంబులన్.
ఈ సుకుమార మాల ధరియింపుము నీ హృదయంబునందు, స్వా
మీ! సుముఖుంబువై పరిణమించు పవిత్ర వసంత మాస సం
ధ్యా సమయాంతరంబుల, రవంత, భవన్మధురార్ద్ర దీర్ఘని
శ్శ్వాస పరిమళానిలపు స్పర్శను, ప్రేమ ననుగ్రహించుచున్